# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 18 పేజీలు - 6 గురువారం 12 డిసెంబర్ 2024


## 21న తెలంగాణ మహిళా యునివర్సిటీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21వ తేదీన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. వర్సిటీ (కోఠీ ఉమెన్స్ కాలేజీ) శతాబ్ది వేడుకలను ప్రారంభించనున్నారు. శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ఈ నెల 17న రాష్ట్రానికి రానున్న సంగతి తెలిసిందే. ఐదు రోజులపాటు ఆమె తెలంగాణలో గడపనున్నారు. ఈ పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రాష్ట్రపతి 17న ఉదయం ఆంధ్రప్రదేశ్‌కు చేరుకుంటారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో జరిగే మొదటి కాన్వకేషన్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. 20న సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌ను సందర్శిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హెూం' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం

- యూపీఎస్సీ మెయిన్స్ లో 20 మంది ఉత్తీర్ణత
- మెయిన్స్‌లో ఉత్తీర్ణులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు




**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్-2024 పరీక్ష ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది మొదటిసారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. సివిల్స్?కు ప్రిపేర్ అవుతున్న పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 135 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్స్ అభ్యర్థులకు చెక్కులు పంపిణీ

వివరాలు 2లో

# వరకట్న వేధింపుల కేసుల్లో జాగ్రత్తలు పాటించాలి

- కోర్టులను సూచించిన సుప్రీంకోర్టు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, డిసెంబర్11:** వరకట్న వేధింపుల కేసుల్లో కోర్టులు అప్రమత్తంగా ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా చూడాలని చెప్పింది. భర్త తరపు వారిని ఇరికించే ధోరణులు కనిపిస్తున్న నేపథ్యంలో చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా.. అమాయక కుటుంబ సభ్యులు అనవసర ఇబ్బందులు పడకుండా జాగ్రత్తపడాలని చెప్పింది. ఫ్యామిలీ వివాదాల కారణంగా తలెత్తే క్రిమన్ కేసుల్లో నిర్దిష్ట ఆరోపణలు లేకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించడాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలని జస్టిస్ బీవీ నాగరత్న, ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా గృహ సంబంధిత వివాదాలు తలెత్తిన సమయంలో భర్త కుటుంబ సభ్యులందరినీ ఇరికించే ప్రయత్నం తరచుగా జరుగుతుందనేది అందరికీ తెలిసిన విషయమేనని.. న్యాయపరంగా ఇది రుజువైందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి పరిస్థితిలో చట్టాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా అమాయకులు ఎవరూ చిక్కుకోండా కోర్టులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పింది. భర్తతో పాటు ఆయన అతడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై భార్య దాఖలు చేసిన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టివేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. అయితే, ఆ ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# కాజీపేట స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం : మంత్రి అశ్వినీ వైష్ణవ్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్11:** కాజీపేట రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ విషయాన్ని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 రైల్వే స్టేషన్లను ఆధునీకరి స్తున్నామన్నారు. దాంట్లో కాజీపేట రైల్వే స్టేషన్ కూడా ఉన్నట్లు చెప్పారు. తెలంగాణకు రైల్వే నిధుల కేటాయింపు పెంచినట్లు మంత్రి చెప్పారు. ఆ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో 5336 కోట్లు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. యూపీఏ పాలన సమయంలో ఉమ్మడి రాష్ట్రానికి కూడా ఆ స్థాయిలో నిధులు రాలేదన్నారు. గతంలో తెలంగాణ, ఆంధ్రకు కలిపి కేవలం 866 కోట్లు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. కేవలం నిధుల కోసమే విభజన సృష్టించడం సరికాదు అని మంత్రి తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను డివిజన్‌గా డెవలప్ చేస్తున్నారా అని వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రశ్న వేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే రీడెవలప్మెంట్ ప్రాజెక్టును మోదీ సర్కారు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా 1300 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, చెన్నైలోని ఎగ్మోర్ రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ స్కీమ్ కింద డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు.





# హైకోర్టులో మోహన్‌బాబుకు ఊరట..

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** టాలీవుడ్ సీనియర్ నటుడు మంచు మోహన్ బాబుకు రాష్ట్ర హైకోర్టులో ఊరట లభించింది. మంగళవారం సాయంత్రం జల్ పల్లిలోని నివాసం వద్ద కవరేజ్ కోసం వచ్చిన ఓ జర్నలిస్ట్ పై దాడి చేయడంతో మోహన్ బాబుకు రాచకొండ సీపీ నోటీసులు ఇచ్చారు. బుధవారం ఉదయం 10.30గంటలకు విచారణ హాజరుకావాలని ఆదేశించారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.రాచకొండ పోలీసుల నోటీసులపై స్టే ఇవ్వాలని మోహన్‌బాబు కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. దీంతో ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి.. పోలీసులు ఇచ్చిన నోటీసులపై స్టే విధించింది. ఈ నెల 24 వరకు పోలీసుల ముందు హాజరుకు మినహాయింపు ఇస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. తదిపరి విచారణను అప్పటివరకు వాయిదా వేసింది.

## కాంగ్రెస్ సర్కార్ వల్ల

# అన్నదాతల అరిగోస

- ఆడబిడ్డల నుంచి ప్రతివర్గం అరిగోస పడుతోంది
- చేతగానీ ముఖ్యమంత్రిని తెలంగాణపై రుద్దారు
- ప్రగతి పథంలో పరుగులు పెట్టిన రాష్ట్రం అధోగతిపాలు
- మీ తీరు చూసి రాష్ట్ర ప్రజలు నిత్యం రగిలిపోతున్నారు
- సీఎం ఢిల్లీకి పంపించే మూటలపై మీకున్న శ్రద్ధ..
- ప్రజలకు మీరిచ్చిన మాటలపై శ్రద్ధ లేదా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖ






**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** తెలంగాన ప్రభుత్వంపై మండిపడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ లేఖ రాశారు. తెలంగాణ బతుకు ఛిద్రం అవుతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తారా? అంటూ లేఖలో ప్రశ్నించారు. నమ్మి అధికారమిస్తే తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీస్తారా?.. పదేళ్లలో మేం పేదల బతుకులు మార్చాం తప్ప.. పేర్లు మార్చలేదని అన్నారు. బిఆర్ఎస్ తలచుకుంటే రాజీవ్ పేర్లు, ఇందిరా విగ్రహాలు ఉండేవా? అని.. నీచ సంస్కృతికి సీఎం రేవంత్ రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే జరగబోయేది అదే అంటూ లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని సర్కార్ అధికారికంగా ప్రకటించలేదని.. అయినా, గ్రామాల్లో తల్లి లాగా తెలంగాణ తల్లి ఉండాలని.. అలానే విగ్రహాన్ని రూపొందించామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అయితే, తెలంగాణ తల్లి తలపై విగ్రహం, చేతిలో బతుకమ్మ తీసేశారని.. ఆ విగ్రహం కాంగ్రెస్ తల్లిలాగా ఉందని బిఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. మేం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విగ్రహాన్ని తీసేస్తామని హెచ్చరిస్తున్నారు.

## ప్రజా విశ్వాసాలతో చెలగాటం సరికాదు:ఎంపి ఈటల



2లో

## ఈవీఎంలపై ఇండియా

# కూటమి ఆరోపణలు..

- సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం
- శరద్ పవార్‌తో అరవింద్ కేజ్రీవాల్ భేటీ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, డిసెంబర్11:** ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి నేపథ్యంలో ఈవీఎం మెషిన్లపై ఇండియా కూటమి నేతల ఆరోపణలు మరింత తీవ్రమయ్యాయి. అవకతవకలు, అనుమానాలపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలని కూటమి నిర్ణయించింది. మహారాష్ట్ర రాజకీయ దిగ్గజం శరద్ పవార్, ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మధ్య మంగళవారం జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్రలోని హడప్సర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఎన్సీపీ-శరద్ పవార్ నేత ప్రశాంత్ జగ్తాప్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహా వికాస్ అఘాడికి అనూహ్య పరాభవం ఎదురైంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఈసారి ముందస్తు ప్రణాళిక అవసరమని భావిస్తున్నట్టు కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీ గెలిచింది. అయితే, ఈసారి ఏకపక్ష విజయం సాధ్యం కాకపోవచ్చనే విశ్లేషణలు ఉన్నాయి. ఆప్ నేతలపై అవినీతి ఆరోపణలు ఉండడంతో ఈసారి విపక్ష బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈవీఎం యంత్రాలను సుప్రీంకోర్టు గట్టిగా సమర్థిస్తోంది. సమర్థవంతంగానే పనిచేస్తున్నాయని చెబుతోంది. తమరు ఓడిపోతేనే సందేహాలా?, గెలిచినప్పుడు ట్యాంపరింగ్ జరగలేదా?

వివరాలు 2లో

# కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారు

- అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారు
- బీఆర్ఎస్ మానసికస్థితి ఏమిటో తెలుస్తోంది
- తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారని, దీంతో బీఆర్ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీధర్ బాబు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ... ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని, అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేల శిక్షణా

వివరాలు 2లో

# ఈవీఎంలపై ఇండియా కూటమి ఆరోపణలు..

(మొదటి పేజీ తరువాయి)

అని విపక్ష పార్టీలను ఇటీవలి విచారణ సందర్భంగా సుప్రీంకోర్ట్ న్యాయమూర్తులు మందలించారు. మరి ఇండియా కూటమి పిటిషన్లు దాఖలైతే సుప్రీం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

# నా తండ్రి మాటే నాకు వేదవాక్కు: మంచు విష్ణు



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** తన తండ్రి మోహన్ బాబు చెప్పినందుకే.. ఇంట్లోకి వచ్చిన వారందరినీ బయటికి గెంటేశానని, ఆయన చెప్పిందే తనకు వేదవాక్కు అని నటుడు, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి అనుమతి లేకుండా ఎవరూ ఇంట్లోకి వెళ్లకూడదని చెప్పారు. మీడియాతో మాట్లాడాలని తన తండ్రి నమస్కరిస్తూ వచ్చే సమయలో అంతా తోసుకుంటూ రావడం వల్ల.. ఒక తండ్రిగా ఆయన రియాక్ట్ అయ్యారని పేర్కొన్నారు.

# కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# రేపట్నుంచే సచివాలయంలో 'ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్' అమలు



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** 12వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలో పని చేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ అటెండెన్స్ వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి వర్తించనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజా విశ్వాసాలతో చెలగాటం సరికాదు:ఎంపి ఈటల



**తొలిఅక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 11:** ప్రజల విశ్వాసాలతో చెలగాట మాడం సరికాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొంతమంది దుర్మార్గులు హిందూ ధర్మానికి వ్యతిరేకంగా, హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం మీద దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితు లను ఈ ప్రాంత ప్రజలు పట్టుకుని పోలీసులుకు అప్ప గిస్తే రోజులు గడిచినా ఇక్కడి ప్రజల మనోభావాలను పట్టించు కోకుండా ప్రభుత్వం నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరించిందని ఆరోపిం చారు. బుధవారం కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ అహంకారపూరితంగా ప్రజల మనోభావాలకు విరుద్ధమైన చర్యలు చేస్తే తప్పకుండా ఈ ప్రభుత్వం కూడా కాలగర్భంలో కలిసిపోతుందని హెచ్చరించారు. అపవిత్రమైన ఆలయప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఈ ప్రాంతవాసులు అనేక రోజులుగా దీక్షలు పూజలు నిర్వహిస్తుంటే వాటిని నిలువరించే ప్రయత్నం చేశారని ఈటల మండిపడ్డారు. దానికి కూడా ప్రభుత్వం దిగిరాకపోతే ర్యాలీ చెపట్టారని ఆ ర్యాలీ మీద అకారణంగా దుర్మార్గంగా పోలీసులు రక్తాన్ని కళ్ల చూశారని ఆరోపించారు. అనేక మందిపై కేసులు పెట్టి, జైల్లో పెట్టారని, చివరికి ప్రభుత్వం దిగివచ్చి ఈ ఆలయాన్ని మళ్లీ పునః ప్రతిష్ట చేస్తామని చెప్పకతప్పలేదన్నారు.

# రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్? ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ. సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్ , బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కడారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్ధిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూలుకు చెందిన గోకమల్ల ఆంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్. ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి. ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, అసిఫాబాద్-కుమ్రంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ సివిల్స్ మెయిన్స్? క్వాలిఫై అయిన జాబితాలో ఉన్నారు. తెలంగాణ నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులందరికీ సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం కింద ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన వారిలో 20 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపిక కావడం పట్ల సీఎం అభినందనలు తెలిపారు. తెలంగాణ నుంచి ఎక్కువ మంది సివిల్స్ సాధించేలా తదుపరి దశల్లోనూ అభ్యర్థులు రాణించాలని సీఎం ఆకాంక్షించారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారికి మరో రూ.లక్ష అందిస్తామని సీఎం గతంలో హామీ ఇచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఎగ్జామ్ 2024 ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. అభ్యర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో చూసుకోవచ్చు. మెయిన్ సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇప్పుడు ఇంటర్వ్యూ రౌండ్ కు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూ షెడ్యూల్ ను త్వరలోనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. అభ్యర్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రధాన కార్యాలయం, ధోల్పూర్ హౌస్, షాజహాన్ రోడ్, న్యూఢిల్లీ-110069లో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది.

# గ్రూప్ 2 పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం

- ఈనెల 15, 16న జరగనున్న పరీక్షలు
- హాల్‌టికెట్ల జారీలో ప్రత్యేక చర్యలు
- జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్ల కేటాయింపు

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** గ్రూప్- 2 పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు సిద్ధం చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే ఈ పరీక్షల కోసం సెంటర్ల వద్ద పకడ్బందీ చర్యలను చేపట్టనుంది. మరోవైపు ఇప్పటికే హాల్ టికెట్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు టీజీపీఎస్సీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అభ్యర్థుల ఇబ్బందులను నివృత్తి చేసేందుకు జిల్లాల వారీగా హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఫోన్ నెంబర్లతో కూడిన జాబితాను వెబ్ సైట్ లో విడుదల చేసింది. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1368 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక హాల్?టికెట్లు డౌన్?లోడ్? సమయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు వస్తే 040-23542185 లేదా 040-23542187 నంబర్లకు సంప్రదించవచ్చు. ఈ-మెయిల్ సందేహాలు పంపవచ్చని టీజీపీఎస్సీ పేర్కొంది. గ్రూప్-2 ఎగ్జామ్ లో భాగంగా%ా%. మొత్తం 4 పేపర్లు ఉంటాయి. టీజీపీఎస్సీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం... పేపర్-1 డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 ఉంటుంది.ఇక డిసెంబరు 16వ తేదీన పేపర్?3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 ప్రతి పేపరులో 150 ప్రశ్నలు 150 మార్కులకు నిర్వహించనున్నారు.

# ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** సికింద్రాబాద్ కుమ్మరి గూడలోని శ్రీముత్యాలమ్మ గుడిలో అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో సికింద్రాబాద్ ఆలయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని.. వెంటనే ప్రభుత్వం స్పందించి స్థానిక శాసన సభ్యుడి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ చేయడం జరిగిందన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందజేసే విధంగా వేద పండితులతో పునఃప్రతిష్ఠ చేసుకొని దేవదాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా దేవాలయాలు, ప్రార్థన మందిరాల పట్ల రాజకీయం చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఆ ముత్యాలమ్మ వారికి రెండు చేతులు జోడించి ప్రజలంతా సుఖ సంతోషాలతో.. ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దేవాలయాలను కాపాడుకోవాలి.. విద్రోహం జరిగినపుడు అందరం కలిసి ఎదుర్కోవాలి కానీ రాజకీయాలు తగదు అన్నారు. ప్రజల విశ్వాసం కాపాడేలా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలియజేశారు. ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వ ఖర్చుతో నిర్మించడంతో పాటు.. పంచలోక విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కొంతమంది రాజకీయ లబ్ధికోసం మత విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలని హెచ్చరించారు. శ్రీ ముత్యాలమ్మ తల్లిని బీజేపీ



ఎంపీ ఈటెల దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా ఆలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

# తెలంగాణకి నంబర్ వన్ విలనే కాంగ్రెస్ పార్టీ

- రేవంత్ రెడ్డి ఉద్యమంలో పాల్గొనలేదు
- చరిత్రలో ఏ రోజు జై తెలంగాణ అనలేదు
- తెలంగాణ అనే పదం అసెంబ్లీలో ఆనాడు నిషేధించారు
- డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటనకు కారణం కేసీఆర్
- ఎవరో దయతోనో తెలంగాణ రాష్ట్రం రాలేదు
- తెలంగాణ ఉద్యమం, అమరులను అవమానపరుస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** సీఎం రేవంత్ రెడ్డి తెలం గాణ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి చరిత్రలో ఏ రోజు జై తెలంగాణ అనలేదుఉద్యమంలో పాల్గొనలేదు అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సంగారెడ్డిలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చిందంటే కారణం కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఎవరో దయతో వచ్చిందని సీఎం చెబుతుంటే ఇది తెలంగాణ ఉద్యమం, అమరులను అవమాన పరచడమే అని మండిపడ్డారు. తెలంగాణకి నంబర్ వన్ విలనే కాంగ్రెస్ పార్టీ. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టకపోతే తెలంగాణ అనే మాటే లేదు కదా. తెలంగాణ అనే పదం అసెంబ్లీలో ఆనాడు నిషేధించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన, 16 ఏళ్ల టీడీపీ పాలనలో తెలంగాణ అనే పదం లేకుండా చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉండి ఢిల్లీలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణకు అనుకూలంగా లేఖలు తెప్పించారు. 2004 నుంచి



2009 వరకు మాతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్. నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన లేకపోతే జూన్ 2 లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించి.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిన నందిని సిధారెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఉద్యమాభివందనాలు తెలిపారు. 'కోటి రూపాయలు ముఖ్యం కాదు. కోట్లాది ప్రజల గుండెల తల్లి ముఖ్యం. అందుకే ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించిన' అని ప్రముఖకవి, రచయిత నందిని సిధారెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. కోటి రూపాయల కన్నా, కోట్లాది ప్రజల గుండెల్లో కొలువైన తెలంగాణ తల్లే మిన్న, బతుకమ్మను తీసేయడం అంటే తెలంగాణ బతుకును అవమానించడమే అని, ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరిస్తూ.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిన నందిని సిధారెడ్డికి హృదయపూర్వక ఉద్యమాభినందనలు తెలుపుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. 'కోటి రూపాయలు ముఖ్యం కాదు. కోట్లాది ప్రజల గుండెల తల్లి ముఖ్యం. అందుకే ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించిన' అని ప్రముఖకవి, రచయిత నందిని సిధారెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లిని మార్చటం అంటే తెలంగాణ ప్రతీకలను మార్చటమేనని, శిల్పుల గిరాకీ కోసం చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు అదే శిల్పులు 'నాడు కేసీఆర్ ప్రభుత్వంతో ఖర్చుపెట్టించారు..ఈనాడు ఈ ప్రభుత్వంతో ఖర్చుపెట్టిస్తున్నారు' అని వాపోయారు. తెలంగాణ సాంస్కృతిక సోయిలేనివాళ్లే వెయ్యేండ్ల బతుకమ్మను లేకుండా చేశారని మంగళవారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తేల్చిచెప్పారు. రాష్ట్రంలో మరోసారి ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఫుడ్ పాయిజన్‌తో 30 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం అన్నారు.. అయినా విషాహారం సంఘటనలు మళ్లీ ఎందుకు జరుగుతున్నాయి సీఎం రేవంత్ రెడ్డి గారూ అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. మీ అసమర్థత బయటకు వస్తదనే కదా గురుకుల బాటలో మేము పాఠశాలలను తనిఖీ చేస్తే మా మీద కేసులు పెట్టి మీ మతిలేని మంత్రులను, ఎమ్మెల్యేలను మా పై ఉసిగొల్పింర్రు? మీకు చేతకాక పోతే గద్దె దిగండి కానీ, దయచేసి మా పేద పిల్లలను విషాహారంతో చంపకండి అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

# కొండాపూర్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి రోడ్డు విస్తరణ నిధులు పెంపు

**- రూ.446.13 కోట్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** హైదరాబాద్ నగరంలోని కొండాపూర్ వైపు నుంచి ఓఆర్ఆర్ వరకు ఆరు లేన్ల ఫ్లైవర్ (ఇరు వైపుల) నిర్మాణం, గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ నుంచి గ్యాస్ కంపెనీ గుండా గచ్చిబౌలి జంక్షన్ వరకు 120 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులకు గతంలో మంజూరు చేసిన రూ.435 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. రూ.11.13 కోట్ల మేర స్వల్పంగా పెంచి మొత్తం రూ.446.13 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ విజ్ఞప్తిని జాగ్రత్తగా పరిశీలించిన అనంతరమే గతంలో మంజూరు చేసిన నిధులను సవరించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఆర్థిక శాఖ అనుమతితో ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు వివరించింది. ఈపీసీ (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు పేర్కొంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణ పనులకు అవసరమైన తదుపరి చర్యలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీసుకుంటారని వివరించింది. కాగా 'వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం' (ఎస్ఆర్‌డీపీ) కింద ఈ ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనులను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన పనులు త్వరలోనే మొదలుకానున్నాయి. ఈ నిర్మాణాలకు పూర్తయితే నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు మరింత తగ్గనున్నాయి.

# నిరసన తెలుపుతున్న తొర్రూర్ జర్నలిస్ట్‌లు

**● మీడియాపై దాడి చేసిన మోహన్ బాబును అరెస్ట్ చేయాలి**
**● పలు జర్నలిస్ట్ సంఘాల డిమాండ్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 11:** ప్రముఖ నటుడు మంచు మోహన్ బాబు తన కుటుంబం లో జరిగిన తగాదా వ్యవహారం లో వార్త కవరేజ్ కు వెళ్లిన ఒక ఛానల్ విలేకరి పై ప్రత్యక్ష దాడికి పాల్పడిన నటుడు మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలనికోరుతూ తొర్రూర్ పట్టణం లో అమర వీరుల స్తూపం సెంటర్ వద్ద పట్టణం లోని పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లు నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. టియూడబ్ల్యూ జే (ఐ జే యూ )జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్, జిల్లా జర్నలిస్ట్ నాయకులు నాగపూరి అశోక్, దేవరకొండ కృష్ణప్రసాద్, వినోద్ రెడ్డి పంతం సురేందర్‌లు మాట్లాడుతూ ఇటీవల జర్నలిస్ట్ లపై ఎదో కారణం తో దాడులు జరుగుతున్నాయని, దీనితో జర్నలిస్ట్ లకు రక్షణ కరువైందని, రక్షణ చట్టం తీసుకురావాలన్నారు.జర్నలిస్ట్ లు ప్రజాస్వామ్యం లో,ప్రజలకు ప్రభుత్వాలకు వారధులని, అలాంటి వారిపై ఒక సెలబ్రేటీ దాడికి పాల్పటం పట్ల ప్రతి ఒక్కరు ఖండించి జర్నలిస్ట్ లకు మద్దతుగా నిలబడా లన్నారు. మీడియా, ప్రింట్ జర్నలిస్ట్ లు బిజ్జాల వెంకట్ రమణ,ఇమ్మడి రాంబాబు, నారాయణ రాజు,బందు శ్రీధర్,సంతోష్, శ్రీకాంత్, కిరణ్ సాంబాశివ, సిరికొండ విక్రమ్,ఎం డి అమిర్ , వేల్పుల మహేష్,రామకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా తరుణి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 11:** మండలంలోని మాటేడు గ్రామంలో ఉన్న జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం సేవా తరుణి అధ్యక్షురాలు మాధవ పెద్ది వాణీ ఆధ్వర్యంలో వాణి మని తండ్రి కీర్తిశేషులు మాధవ పెద్ది సురేందర్ రెడ్డి జ్ఞాపకార్ధంగా సేవా తరుణి ట్రెజరర్ మని ఆర్థిక సహాయంతో గణిత ప్రతిభ పోటీలలో పాల్గొన్న వివిధ మండలాల కు చెందిన 300 మంది విద్యార్థులకు అన్నప్రసాద వితరణ చేశారు.వాణి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్ సి ఆర్ శ్రీదేవి,చాటర్ ప్రెసిడెంట్ ఎఫ్ డబ్ల్యూసి డాక్టర్ శారదా,డిసివి శైలజ, సెక్రటరీ రాధిక, లయన్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయన్న

**పెద్దవంగర డిసెంబర్ 11 (తొలి అక్షరం):** మండలంలోని , వడ్డే కొత్తపల్లి గ్రామ మాజీ వార్డు మెంబర్ కేశబోయిన రామరాజు అనారోగ్యంతో ఇటీవలే హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటి వద్ద ఉంటున్న విషయం తెలుసుకొని నేడు వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాను అదేవిదముగా పార్టీ ఎల్లప్పుడూ వారికీ అండదండలు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమం లో మండల,పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య. మండలం సీనియర్ నాయకులు శ్రీరామ్ సుదీర్.గ్రామ పార్టీ అధ్యక్షులు కేశబోయిన కుమార్ యాదవ్. యూత్ నాయకులు కేశబోయిన బోస్. మాజీ సర్పంచ్ మొగ్రిగాడుదుల Artificial. మాజీ వార్డ్ మెంబర్ దంతలపెల్లి జనార్దన్ గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# కేశగాని వీరయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తొర్రూర్ గౌడ పరపతి సంఘాల నాయకులు

**● కల్లుగీత వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నటువంటి గౌడ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి ● గోపా మహబూబాద్ జిల్లా అధ్యక్షులు తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు. కుర్ర శ్రీనివాస్ గౌడ్. తాళ్లపల్లి రమేష్ గౌడ్**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్11:** కల్లుగీత వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నటువంటి గౌడ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గోపా మహబూబాద్ జిల్లా అధ్యక్షులు తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు. కుర్ర శ్రీనివాస్ గౌడ్. తాళ్లపల్లి రమేష్ గౌడ్ అన్నారు.గత ఐదు రోజుల కింద కల్లుగీత వృత్తి లో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవ శాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం నాంచారి మడూర్ గ్రామంలో కల్లుగీత వృత్తిని నమ్ముకొని జీవనం



కొనసాగిస్తున్న కేశగానీ వీరయ్య గౌడ్ తాటి చెట్టు పై నుండి కింద పడి మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి. 50.కేజీల రైస్ తో పాటు.ఆర్థిక సహాయం చేసిన.తొర్రూర్ గౌడ సహకార పరపతి సంఘం కౌండిన్య సహకార పరపతి సంఘం. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పరపతి సంఘం. శ్రీ కంఠమహేశ్వర సహకార పరపతి సంఘాలు. కుటుంబానికి అందజేయడం జరిగింది.గోపా మహబూబాద్ జిల్లా అధ్యక్షులు. తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు. కుర్ర శ్రీనివాస్ గౌడ్. తాళ్లపల్లి రమేష్ గౌడ్. మాట్లాడుతూ.ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి గాయాలైనటువంటి కల్లుగీత కార్మికులకు. 5 లక్షలు. మరణించినటువంటి కల్లుగీత కార్మికులకు 10 లక్షలు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ప్రాంతంలో కల్లుగీత వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నటువంటి నిరుపేద కుటుంబాలు. వారి పిల్లల చదువులకైనా. ప్రమాదవశాత్తు ఏమైనా జరిగిన మాకు సమాచారమిస్తే ఆ కుటుంబాలకు అండగా ఉంటామని వారు తెలిపారు.వీరయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో గౌడ సహకార పరపతి సంఘం. అధ్యక్షులు దీకొండ శ్రీనివాస గౌడ్. ప్రధాన కార్యదర్శి. జలగం శ్రీనివాస్ గౌడ్.కౌండిన్య సహకార పరపతి సంఘం. అధ్యక్షులు. నాగపురి అశోక్ గౌడ్. ప్రధాన కార్యదర్శి. కుంభం మహేష్ కుమార్ గౌడ్. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ పరపతి సంఘం. అధ్యక్షులు. కోటగిరి కుమార్ గౌడ్. శ్రీ కంఠమహేశ్వర సాకార పరపతి సంఘం. గౌరవ అధ్యక్షులు. రమేష్ గౌడ్. గోపా డివిజన్ కార్యదర్శి. చిరగాని రమేష్ గౌడ్. మండల అధ్యక్షులు. రాయి పెల్లి యాకయ్య గౌడ్. మరియు పులి ముత్తిలింగం గౌడ్ నల్ల మాస సుధాకర్ గౌడ్.మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలి

**● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 11:** గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు.మండలంలోని హరిపిరాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడలను పరిశీలించారు.అనంతరం బుధవారం నిర్వహించిన క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు.గ్రామీణ



ప్రాంతాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.క్రీడలతో స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని,ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,పట్టణ అధ్యక్షుడు సోమ



రాజశేఖర్,మాజీ వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి,గ్రామ అధ్యక్షుడు తోట అశోక్, కాంగ్రెస్ నాయకులు వెన్నెం సోమిరెడ్డి,కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రావుల కిషన్ రెడ్డి, బైరుపాక వెంకన్న, యువజన నాయకులు పరుశు రాములు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ టీచర్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**● మహబూబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 11:** తొర్రూర్ టీచర్స్ క్లబ్ సేవలు అభినందనీయం అన్ని మహబూబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి అన్నారు.టీచర్స్ క్లబ్ తొర్రూర్ టీచర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ అధ్యక్షతన బుధవారం చర్లపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.జడ్.పి.హెచ్.ఎస్ చెర్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, మరియు ఎగ్జామ్ మెటీరియల్, స్నాక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహబూబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.తొర్రూర్ టీచర్స్ క్లబ్ వారు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకై పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని, మంచి లక్ష్యాన్ని ఎన్నుకొని టీచర్స్ క్లబ్ వారు పనిచేస్తున్నందుకు వారిని అభినందించడం జరిగింది. మరియు స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, విద్యార్థులు చదువు




మీద శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలు రావాలని, పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన పరచడం జరిగింది. పదో తరగతి విద్యార్థులు బెస్ట్ ప్రాక్టీస్ కింద పాఠశాలకు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు చూడాలని, పదోతరగతి విద్యార్థులను విద్యార్థులను ఉపాధ్యాయులు అందరూ దత్తత తీసుకోనీ వారి మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ సూరం ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్య నేర్పిన గురువులకు కనిపించిన తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ మాట్లాడుతూ. టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం టీచర్స్ క్లబ్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందజేస్తుందని, విద్యార్థులు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌నుఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ ఎఫ్ డబ్ల్యూ సి జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వేలూరి శారద మాట్లాడుతూ.పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధన కోసం విలువైన సలహాలు సూచనలు అందించి, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు , తొర్రూరు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య మాట్లాడుతూ. పదో తరగతి విద్యార్థులకు టీచర్స్ క్లబ్ వారు స్టడీ మెటీరియల్ ఇవ్వడం అభినందనీయమని, టీచర్స్ క్లబ్ వారు మా పాఠశాలను ఎంచుకోవడం చాలా సంతోషంగా ఉందని, టీచర్స్ క్లబ్ వారికి ధన్యవాదాలుతెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ రేగురి శ్రీదేవి, క్లబ్ కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ రాయిపెల్లి యాకయ్య, మరియు టీచర్స్ క్లబ్ ప్రతినిధులు తోట రమేష్ , ఉపాధ్యాయులు జయపాల్ రెడ్డి , యాకూబ్, స్వర్ణలత కవిత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట

**● తొర్రూర్ సీఎం కప్ క్రీడలు ప్రారంభం**
**● తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 11:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు



సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నాడని తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి లు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో తహసిల్దార్ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్,తొర్రూరు ఎస్సై ఉపేందర్ లతో కలిసి సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉత్సాహానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య,శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ,సీనియర్ క్రీడాకారుడు ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఎస్ జిఎఫ్ఐ తొర్రూరు జోన్ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వినయ్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల అధ్యయనం కోసం ఇంటింటికి సిపిఎం...





**తొలి అక్షరం/నర్సింహులపేట డిసెంబర్ 10:** మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల అధ్యయనం కోసం ఇంటింటికి సిపిఎం కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 15 వరకు మండలంలోని గ్రామాలలో పలు బృందాలుగా ఏర్పడి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇంటింటి సర్వే చేస్తామన్నారు.మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా వికలాంగులు వృద్ధులు వితంతులు పెన్షన్లు రాక ఇబ్బంది పడుతున్నారని నూతన రేషన్ కార్డులు ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగతావి ఏవి అమలు కాలేదని రైతుబంధు రైతు రుణమాఫీ దళితులకు అంబేద్కర్ అభయ హస్తం కింద 12 లక్షల రూపాయలు అన్ని నీటి మూటలుగానే మిగిలాయన్నారు ప్రభుత్వం వచ్చిన వంద రోజులు లోపే ఆర్ గ్యారంటీల అమలు అని అబద్ధాలు చెప్పి నేటికీ సంవత్సరం కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయడం లేదని ప్రజలు అసహన వ్యక్తం చేస్తున్నారని అన్నారు దశబ్ద కాలంగా పేరుకుపోయిన సమస్యలను తెలుసుకొని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి సాధనకై కృషి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు యనమనగండ్ల సోమిరెడ్డి బానోతు సర్వన్ మందుల యాకూబ్ జయమ్మ కౌసల్య శోభ సోమక్క వెంకటమ్మ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్‌కు ఏఐటీయుసి వినతి



**తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 11:** మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అధ్వర్యంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికుల నుంచి ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. అతి తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులు ఎవరైనా ఉంటే వారు ముధ్యాహ్న భోజన కార్మికులేనని వినతి పత్రంలో పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కనీస వేతనం క్రింద రూ. 26వేలు చెల్లించడంతోపాటు పెండింగ్లో ఉన్న మెనూ ఛార్జీలను, కోడిగుడ్ల బిల్లులు, అల్పాహార బిల్లులు, గౌరవ నేతనాన్ని విడుదల చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏడు నెలలుగా వేతనం పెండింగ్లో పెట్టారని వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేలు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాది లక్ష్మి నారాయణ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ, ఇజ్జగాని వెంకటమ్మ, ఒక్కంపూడి వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి. ఆరోమణి, సీత, పార్వతమ్మ, వెంకట్రావమ్మ, శిరోమణి, భారతి, వరలక్ష్మి, రంగమ్మ, కనకమ్మ, తిరపతమ్మ తదితరులు ఉన్నారు. వినతి పత్రం ఇవ్వటానికి ముందు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

# మీడియా జోలికి వస్తే సహించం..!!

- డిఎంజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్..
- జర్నలిస్టులకు మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి..



**తొలి అక్షరం/ నెల్లికుదురు,డిసెంబర్ 11:** ఎంతటి వారైనా మీడియా జోలికి వస్తే సహించేది లేదని డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ (డిఎంజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ హెచ్చరించారు. బుధవారం ఆయన తొలి అక్షరం ప్రతినిధితో మాట్లాడుతూ, మీడియాపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కవరేజ్ కి వెళ్ళిన మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడి దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు రోజురోజుకు మితి మీరుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# జంతుశాస్త్రం బోధించుటకు అభ్యర్థులు కావలెను

- అతిథి అధ్యాపక నియామకం

**తొలి అక్షరం/నరసింహుల పేట. డిసెంబర్ 10:** స్థానిక నరసింహుల పేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ నందు 9వ తరగతి వరకు జీవశాస్త్రం మరియు జంతుశాస్త్రం బోధించుటకు అనుభవం మరియు అర్హత గల అభ్యర్థులు కావలెనుజి.వెంకటకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందులో ఎంపిక కాబడిన అభ్యర్థి 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బోధించాల్సి ఉంటుంది. ఇందుకుగాను అభ్యర్థులు M.Sc.Zoology, B.Ed అర్హత కలిగి ఉండవలెను.ప్రతినెల 100 పీరియడ్స్ వరకు మాత్రమే గౌరవ వేతనం పిరియడ్కు 182 రూపాయల చొప్పున మొత్తంగా 18200 ఇవ్వబడును. ఈ నియామకం పూర్తిగా తాత్కాలికమైనది.కావున అర్హత ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీ శుక్రవారం రోజున ఉదయం ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్ నందు నిర్వహించే ఇంటర్వ్యూ మరియు డెమో క్లాసు కి తగిన ధ్రువ పత్రాలతో హాజరు కాగలరని ప్రిన్సిపల్ సంప్రదించాలని ఆయన కోరారు

# క్రీడలతో మంచి భవిష్యత్తు...!!

- తహసిల్దార్ కోడి చింతల రాజు..
- నెల్లికుదురులో సీఎం కప్ క్రీడలు ప్రారంభం..





**తొలి అక్షరం/నెల్లికుదురు, డిసెంబర్ 11:** చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉందని తహసిల్దార్ కోడి చింతల రాజు అన్నారు. బుధవారం నెల్లీకుదురు హైస్కూల్లో జరుగుతున్న సీఎం కప్ క్రీడల మండల స్థాయి క్రీడ పోటీలను ప్రారంభించిన అనంతరం తహసిల్దార్ కోడి చింతల రాజు ముఖ్యఅతిథిగా పాల్గొనిమాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. మంచి వాతావరణంలో మన స్థాయి పోటీ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక ఆరోగ్యానికి తోడ్పతాయన్నారు.మండల ఎంఈఓ రాందాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకువెళ్లేందుకు ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ నిర్వహిస్తున్నట్లుఈ క్రీడలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో పంపడం జరుగుతుందన్నారు.పోటీలలో 1200 మంది క్రీడాకారులు పాల్గొన్న వారికి బోజన వసతి కల్పించనున్నట్లు. తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు స్థానిక హై స్కూల్ హెచ్ఎం రవి, ఎంపీఓ పద్మ, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, మాజీ వైఎస్ ఎంపీపీ జిల్లా వెంకటేష్,డిసిసి ఉపాధ్యక్షులు గుగ్లోత్ బాలాజీ నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాచికలు స్టేజి నుండి మేచరాజుపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- ఆర్టీసీ బస్సును నాలుగు ట్రిప్పులు నడపాలి
- అకాల వర్షాలకు తెగిపోయిన కట్టను మరమ్మతు చేయాలి
- ఎస్సారెస్పీ కాలువను పూర్తి చేయాలి
- సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో..

**తొలి అక్షరం/నెల్లికుదురు,డిసెంబర్ 11:** కాచికల్ స్టేజీ నుండి మేచరాజుపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. బుధవారం నెల్లికుదురు మండలంలోని సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేలోనిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు.సర్వే లో భాగంగా కాచికలు ఎర్రబెల్లి గూడెం రామంజపురం సొసైటీ తండా సర్వే నిర్వహించిన అనంతరం ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా కాచికల్లు స్టేజి నుంచి మేచరాజుపల్లి వరకు రోడ్డు గుంతల మయంగా ఉండటం వలన ఆర్టీసీ బస్సు రాకపోవడం వల్ల ప్రజల సౌకర్యార్థం లేక ఇబ్బందులు ఎదుర్కొంటు అకాల వర్షాలకు కాచికల్లు గ్రామం సమీపాన వ్యవసాయదారులు భూమి సుమారుగా1800వందల ఎకరాలు రైతులు నిత్యం వారికి ఉపయోగపడే తాళ్లగడ్డకు వెళ్లే దారి1380మీటర్ల దూరం గల దారి అధ్వానంగా ఉండటం వల్ల వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టను ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు చెరువుకట్టకు మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్రబెల్లి గూడెం ప్రజలు భూములు అంతంతమాత్రంగా ఉన్న వారికి పట్టాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని గ్రామాలలో ఉపాధి పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని గిరిజనులు సాగు చేసుకుంటున్నా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని రైతు భరోసాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ సర్వే కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు మండల నాయకులు బాబు గౌడ్ దస్తగిరి గణపురం ఎల్లయ్య వెంకన్న అశోక్ శ్రీను కుమారు సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# వాహనాల తనిఖీలో పట్టుబడిన ముప్పై కింటాల నల్ల బెల్లం ఒక క్వింటా పటికి



**తొలి అక్షరం/దంతాలపల్లి డిసెంబర్ 11:** దంతాలపల్లి లో ఎస్సై పీ రాజు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వాహనం అనుమానం రావడంతో తనిఖీ చేయగా ఆ వాహనంలో టాటా ఇంట్రా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ముప్పై కింటాల నల్ల బెల్లం ఒక క్వింటా పటికి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి,సీజ్ చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి రాజు తెలిపారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీ.ఆర్.ఎస్ యువ నాయకుడు కంది కృష్ణ చైతన్య రెడ్డి



**తొలి అక్షరం న్యూస్/చెన్నారావుపేట డిసెంబర్ 11 :** చెన్నారావుపేట మండలం నెం 1 కాలనీ గ్రామనికి చెందిన పసునూరి యాకూబ్ ,బాబు సామ్యూల్ పసునూరి ఎల్లమ్మ ఆనారోగ్యంతో మరణించగావారి పార్థిహ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కంది కృష్ణ చైతన్య రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కొఆప్షన్ ఎం.డి రఫీ , బీ.ఆర్.ఎస్ ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్,నర్మెట సాంబయ్య ,సాధు నర్సింగరావు,ఆకులపెల్లి సుదర్శన్, జంగిలి రాజేష్ ,జంగిలి రమేష్ ,బరపాక నవీన్,జంగిలి సతీష్ ,తీగల అశోక్, పైసా సాగర్ మరియు పార్టి నాయకులు పాల్గొన్నారు.

# గుండె పోటుతో పల్లపు వెంకన్న మృతి

**పెద్దవంగర డిసెంబర్ 11(తొలి అక్షరం):** మండలం లోని వడ్డేకొతపెల్లి గ్రామంలొ పల్లపు వెంకన్న వయస్సు 55 ఉదయం 3 గంటలకు హైదరాబాద్ లొ గుండె పోటుతో మరణించారు వారికీ 3 కుమారులు 1కుమార్తె ఉన్నారు కుల వృత్తి నిమిత్తం హైదరాబాద్ లొ మట్టి పని చేసుకుంటూ రోజు వారి కూలి చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు ఇప్పుడు వారి మరణం కుటుంబానికి తీరని లోటు గా ఉండటం వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబసభ్యుల ఆవేదన తో తెలియచేసినారు



# సినీ నటుడు మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయాలి

**● జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి!**
**● ఖమ్మంలో టియుడబ్ల్యుజె(ఐ జేయు) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ ● జిల్లా పోలీస్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేత**

**తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 11:** హైదరాబాదులో జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్ బాబుని, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయు ) ఖమ్మం జిల్లా కమిటి ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలో నల్లబ్యాడ్జీలను,ప్లకార్డులను ధరించి నిరసన ర్యాలీ నిర్వహించి జిల్లా పోలీస్ కమీషనర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..రాష్ట్రంలో రోజు రోజుకు జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతుందని, సెలబ్రెటిలు సైతం పాత్రికేయులపై దాడి చేయడం అత్యంత శోచనీయమన్నారు. మోహన్ బాబు కుటుంబ తగాదాలపై ఒకరికొకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్న తరువాతనే మీడియా అతని నివాస ప్రాంతానికి చేరుకుందని,అయితే మీడియాను నియంత్రించే హక్కుగాని ,దాడి చేసే హక్కు గాని మోహన్ బాబుకు లేదన్నారు. విధినిర్వహణలో భాగంగా న్యూస్ కవరేజికి వెళ్ళిన జర్నలిస్టులపై మోహన్ బాబు తన అనుచరులు, రౌడీలు,గూండాలు, బౌన్సర్ లతో దాడి చేయించడాన్ని తమ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఘటనలో టివి9 రిపోర్టర్ రంజిత్ తో పాటు టివి5 వీడియో జర్నలిస్టు కూడా తీవ్రంగా గాయపడ్డారని,ఇలాంటి దాడులతో జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తే ..సహించేది లేదని పేర్కొన్నారు. సమాజ హితానికి పాటుపడుతున్న జర్నలిస్టులపై దాడికి పాల్పడడం ప్రతి ఒక్కరికి ఫ్యాషన్ గా మారిందని విమర్శించారు. మీడియాతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించాల్సింది పోయి నోటి దురుసుతనంతో వ్యవహరించడం కాకుండా భౌతిక దాడులకు దిగడం క్షమించరానిదని అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీల్ జీవితంలో విలన్ పాత్రలు పోషించిన మోహన్ బాబు,నిజ జీవితంలో కూడా విలన్ మాదిరిగా వ్యవహరించడం తగదన్నారు. గతంలో కూడా ఇలాగే పలువురుని దూషించడం,దాడి చేయడం జరిగిందని కనుక తక్షణమే మోహన్ బాబును, అతని అనుచరులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వీధి రౌడీ లాగా ప్రవర్తించిన మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విచక్షణ కోల్పోయి వ్యవహరించిన మోహన్ బాబుపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా ఆయన పలువురిపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. స్థంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సోసైటీ అధ్యక్షులు,ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనకం సైదులు మాట్లాడుతూ..సినిమా నటుల చిత్రాల ప్రచారానికి, ప్రి రిలీజ్ కి,ఆడియో రీలిజ్ కి మీడియా కావాలి కాని అదే మీడియాపై ఒక నటుడు దాడి చేస్తే చిత్ర పరిశ్రమలో ఎవ్వరూ కూడా ఖండించకపోవడం దారుణమన్నారు. మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేసి జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు)నగర శాఖ అధ్యక్షులు మైసాపాపారావు,కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ ,జిల్లా కోశాధికారి జనతా శివ, ఉపాధ్యక్షులు మైనోద్దిన్, జిల్లా నాయకులు జనార్దనా చారి, ఎలక్ట్రానిక్ మీడియా అసిసోయేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల భూపాల్ రావు,కార్యదర్శి అయ్యప్ప, మహేందర్,నగర నాయకులు ఏలూరు వేణుగోపాల్, కళ్యాణ్, ,మేడి రమేశ్, ఉపేందర్ రెడ్డి ,కొత్తూరు రమేశ్,బుర్రి శ్రీనివాస్,సాయి,శ్రీధర్ శర్మ ,ప్రెస్ క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అలస్యం అప్పారావు. జిల్లా నాయకులు ఎల్ సుధాకర్, ఎన్ సంపత్ కుమార్, గణేశ్, ప్రుధ్వీ, వి. వినయ్ కుమార్,ఫయాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఐక్యతవర్ధిల్లాలని,జర్నలిస్టులపై దాడిని ఖండించాలని,దాడికి పాల్పడ్డ మోహన్ బాబు పై చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్ కు వినతిపత్రాన్ని అందజేశారు.






# సేవా భూషణ్ అవార్డు - 2024 అవార్డు అందుకున్న బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్, కానిస్టేబుల్ కన్నె రాజు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** గత 20 సంవత్సరాలుగా రక్తదానం పై చేస్తున్న సేవలను గుర్తించి సేవా భూషణ్ అవార్డు - 2024 అందుకున్న బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు(స్విమ్మర్ రాజు) అవార్డు అందుకున్నారు. బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ డి కన్వెన్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా, స్వచ్ఛందంగా, సామాజిక మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మానవతావాదులను వివిధ రంగాలలో అత్యున్నతమైన సేవలు అందించిన వారికి సేవా భూషణ్ అవార్డు - 2024 అవార్డ్స్ ఇవ్వడం జరిగింది. ఇందులో రక్తదానంపై సేవలందించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు (ఏ.ఆర్) పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రమనీల దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). గత 20 సంవత్సరాలుగా స్వయంగా 35 సార్లు రక్తదానం చేయడం, తలసేమియా చిన్నారుల కోసం 63 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారికి 17,665 మందికి ఉచితంగా రక్తం అందించడం, 5 రాష్ట్రాలలో రక్తదాన పై అవగాహన కల్పించడం, దీనితోపాటు అన్నదానం, అవయవ దానం, విద్యాదానం, హరితహారం, స్వచ్ఛ - భారత్, కరోనా (కోవిడ్ - 19) కష్టకాలంలో ప్లాస్మాదానం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను అవార్డ్ అందు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన డిస్టిక్ కన్స్యూమర్ కమిషన్ కాకినాడ జడ్జి రఘుపతి వసంత కుమార్, డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కాకినాడ విష్ణు రఘువీర్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ (ప్రెసిడెంట్) బొడ్డపాటి దాసు, కర్రి భామి రెడ్డి, స్వామి నాయుడు, తబిత రత్న కుమారి, సత్యనారాయణ చేతుల మీదుగా " సేవా భూషణ్ అవార్డు - 2024 " ను అందుకున్నారు. ఈ అవార్డ్ ను రక్తదాతలందరికీ అంకితం చేస్తున్నానని రాజు తెలిపారు. అదే విధంగా నాకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న నా కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, నా యొక్క గురువులకు, వరంగల్ పోలీస్ శాఖ వారికి, రక్తదాతలకు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




# క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుబేదారి పోలీసులకు 10 బారికేడ్లు, 30 కుర్చీల అందజేత

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సమస్యను గుర్తించి సిఎస్ఆర్ నిధులతో క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్, క్రెడిట్ ఆక్సిస్ ఇండియా ఫౌండేషన్ వారు బుధవారం 10 బారికేడ్ల తో పాటు, పోలీస్ స్టేషన్ అవసరాల నిమిత్తం 30 కుర్చీలను సంస్థ ప్రతినిధులు సుబేదారి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కి, అట్టి సంస్థ ప్రతినిధులు అయినా రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ ఏరియా మేనేజర్ నరేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుబేదార్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో ముందుకు వచ్చి బారికేడ్లు, కుర్చీలను అందజేసిన సంస్థకు, వారి బృందానికి ప్రత్యేకంగా ప్రశంసించారు.సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా సుబేదారి పోలీస్ స్టేషన్ కు 10 బారికేడ్లు మరియు స్టేషన్ అవసరాల నిమిత్తం 30 కుర్చీలను అందజేయడం జరిగిందని, భవిషత్తులో ఇలాంటి మరిన్ని సామాజిక కార్యక్రమలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.




# విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం




**తొలి అక్షరం/మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 11:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుడమి హై స్కూల్ బోడుప్పల్ లో మేడిపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ మరియు షీ టీమ్స్ సంయుక్తంగా విద్యార్థినీ విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్. గోవిందరెడ్డి. సీఐ మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఎప్పటికప్పుడు టెక్నాలజీని వినియోగించుకుని సాంకేతికతను అందుపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని, ఉపాధ్యాయుల పట్ల, పెద్దల పట్ల గౌరవంగా ఉండాలని, అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాలకు ముఖ్య కారణం ఒకటి అత్యాశ రెండు అమాయకత్వం ఈ రెండు కారణాలవల్ల సైబర్ నేరాలు జరుగుతాయని తెలిపారు.ఏదైనా సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 కు కాల్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు చేస్తూ సమాజంలో మహిళల పట్ల చిన్న పిల్లల పట్ల జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎట్టి పరిస్థితులతో పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని, తల్లిదండ్రుల ప్రవర్తన ఆధారంగానే విద్యార్థుల ప్రవర్తన సమాజంలో ఉంటుందని, ఇన్స్పెక్టర్ సూచించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఘట్కేసర్ సబ్ ఇన్స్పెక్టర్ మల్లయ్య మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, విద్యార్థినీ విద్యార్థులకు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు.పుడమి స్కూల్ చైర్మన్ సంజీవరావు, మరియు స్కూల్ ప్రిన్సిపల్ పద్మిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు దాదాపుగా 400 మంది పాల్గొన్నారు.

# నర్సంపేటలో పట్టణ శివారులో విషాద ఘటన పెళ్లికి హాజరై వ్యక్తి మృత్యువాత




**తొలిఅక్షరం/నర్సంపేట, డిసెంబర్ 11:** నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ని ఒక పెళ్లికి వచ్చిన యువకుడు అనుకోకుండా మృత్యువాత పడ్డాడు వివరాల్లోకి వెళ్తే మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు నర్సంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగే వివాహ వేడుకకు హాజర య్యారు అనంతరం కారులో నర్సంపేటలోని మాదన్నపేట చెరువు వైపు వెళ్లారు ఈ క్రమంలో చెరువు మత్తడి వద్ద కారు అదుపు తప్పి చెరువులోకి ప్రమాదవశాత్తు దూసుకుపోయిన కారు చెరువులో పడిపోయింది అయితే ఆ కారులో అప్పటికే ముగ్గురు యువకులు ఉన్నారని గమనించిన స్థానికులు చెరువులోకి దూకి ఇద్దరి యువకులను కాపాడగా మరో యువకుడు మృతి చెందాడు అయితే మృతుడిది మహబూబాబాద్ జిల్లాకి సంబంధించిన విష్ణు గా గుర్తించడం జరిగింది అయితే అగ్నిమాపాక సిబ్బంది చురువులోనుండి ట్రాక్టర్ సాయంతో కారును బయటికి తీసి అందులో ఇరుక్కుపోయిన విష్ణు అనే వ్యక్తి డెడ్ బాడిని పోస్టుమార్టంకు నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అక్రమ నిల్వ రేషన్ బియ్యం పట్టివేత



**తొలి అక్షరం/చెన్నారావుపేట, డిసెంబర్ 11:** మండల కేంద్రంలోని ముగ్ధంపురం గ్రామంలో అక్రమంగా నిలువ చేయబడిన రేషన్ బియ్యాన్ని చందావత్ నారాయణ, చందవత్ పూరిల వద్ద స్వాధీన పరచు కోవడం జరిగింది అని చెన్నారావుపేట మండల ఎస్సై రాజేష్ రెడ్డి తెలియజేశారు అయితే దీనికి సంబంధించి పూర్తి సమాచారం మేరకు అక్రమంగా నిలువజేసిన పిడిఎఫ్ ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని.పూరీకి చెందిన రేకుల షెడ్డులో నిర్వహించిన తనిఖీలలో భాగంగా 34 బ్యాగుల సుమారు 14 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని గుర్తించడం జరిగిందని దానిని స్వాధీన పరుచుకోవడంతోపాటు వారి ఇరువురి పైన కేసు నమోదు చేశామని. అని స్థానిక మండల ఎస్సై రాజేష్ రెడ్డి తెలియజేశారు ఈ యొక్క తనిఖీల్లో భాగంగా కానిస్టేబుల్ వెంకటరమణ స్వామి సతీష్ లు తదితరులు పాల్గొన్నారు.

# కార్య విధానం కార్యక్రమం నిర్వహణ నియామవళి అవగాహన సదస్సు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఏంసిఆర్‌ఎచ్ఆర్డి ఇన్స్టిట్యూట్ లో శాసనసభ శాసన పరిషత్ సభ్యులకు ఏర్పాటుచేసిన కార్య విధానం కార్యక్రమం నిర్వహణ నియామవళి పై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమం లో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు.ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో మంత్రులు,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# అవతార పురుషుల సంకల్పమే సమాజ క్షేమం

- దాస్యం రంగనాధ స్వామి పిలుపు
- విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల వితరణ

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** నర్సంపేట పట్టణంలో గల మదర్స్ ల్యాండ్ హైస్కూల్ లో గీతా జయంతి భగవద్గీత జన్మదినోత్స వేడుకలు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ వికాస తరంగిని సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య ఘనంగా భగవద్గీత గ్రంథావిష్కరణ బుధవారం ఘనంగా జరిగింది.కార్యక్రమంలో తొలుత పాఠశాల కరాస్పాండెంట్ పాశికంటి నవిత, రమేష్, ధర్మాచార్య బాధ్యులు రంగనాధ స్వామి,వికాస తరంగిని బాధ్యులు మహిళలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని 7,8,9,తరగతి విధ్యార్థుల మధ్య ప్రారంభం చేశారు.నవిత మాట్లాడుతూ....విద్యార్థులకు గీత జయంతి శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల సందర్భంగా రంగనాధస్వామి మాట్లాడుతూ... తిరుమల తిరుపతి వారి భగవద్గీత పుస్తకాలు విద్యార్థి దశలోనే మనస్సుకు తెలియాలని అవతార పురుషులు అపుడప్పుడు పుడతారు వారు చేపట్టే కార్యాలు సమసమాజ ఉద్దారనకే వారే పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారు



116 అడుగుల సమతామూర్తిని అట్లాగే 108 దివ్యదేశాల ప్రతిష్ట శంషాబాధ ముంచింతల్ లో ఏర్పటు చేసి ఎన్నో దార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారని,ఆ బాటలోనే విద్యార్థులు, పెద్దలు వెళ్లాలని,హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి వారి భగవద్గీత గ్రంథము విద్యార్థులదరికి ఇస్తున్నామని ఆయన చెప్పారు. వీటి బాధ్యులు శ్రీధర్ యతిపతి మాట్లాడుతూ....ధర్మాన్ని పెం పొందించడానికి చిన్న సమస్య వచ్చినా గానీ, భగవద్గీత శ్లోకాలు పటిస్తే మనశాంతి కలుగుతందని చెప్పారు. వికాస తరంగిని బాధ్యులు కోటా శ్రీనివాస్, చంద్రశేఖర్, పంచమర్తి, సరిత, బండారి కవిత, వద్దే శ్రీలక్ష్మి, దాస్యం రూపావతి, పాఠశాల



తెలుగు ఉపాధ్యాయులు గోగినేని శ్రీనివాస్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొని కార్యక్రమం సుసంపన్నం చేశారు.

# ఎమ్మెల్యేల ఒరియేంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ లో శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులకు నిర్వహించిన ఒరియేంటేషన్ కార్యక్రమంలో మంత్రులు, సహచర ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించిన

# వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ డివిజన్ సహా పలు సమస్యలపై ప్రశ్నించిన ఎంపీ
- నష్కల్ నుండి హసన్ పర్తి మరియు నష్కల్ నుండి చింతలపల్లి బైపాస్ రీ అలైన్మెంట్ జరగాలని కోరిన ఎంపీ డా.కడియం కావ్య
- రైతులకు నష్టం జరగకుండా చూడాలన్న ఎంపీ డా. కడియం కావ్య
- కాజీపేటలో అదనపు ఫ్లాట్ ఫామ్ లను ఏర్పాటు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య డిమాండ్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, బైపాస్ లైన్ అలైన్ మెంట్, ఫ్లాట్ ఫామ్ ల విస్తరణ తదితర అంశాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్



కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ మాన్యు ఫ్యాక్చరింగ్ యూనిట్ సమగ్ర ఇంజిన్, కోచ్, వ్యాగన్ ల ఉత్పత్తి యూనిట్ గా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు. రాష్ట్ర విభజన చట్టం లో ఇచ్చిన హామీ మేరకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారా అని ఎంపీ డాక్టర్ కావ్య నేరుగా వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ప్రస్తుతం రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లు అన్ని రకాల మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లు గా అభివృద్ధి పరుస్తున్నామని కాజీపేట మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లో సమగ్ర కార్యాచరణతో కూడిన పరిశ్రమను డెవలప్ చేస్తున్నామన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటు పై ఎంపీ వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ గత ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో పోలిస్తే ప్రస్తుతం 5 వేల కోట్ల పై చిలుకు నిధులు తెలంగాణ రాష్ట్రానికి రైల్వే పనులకోసం కేటాయించామని రైల్వే అభివృద్ధి విస్తరణ ప్రస్తుతం సునాయాసంగా జరుగుతున్నందున ఆ అంశం ఆలోచించటం లేదన్నారు. బైపాస్ రైల్వే లైన్ లు వ్యవసాయ రంగ కార్యకలాపాలకు అవరోధం గా నిలుస్తూ రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కావ్య వివరించగా.. ఈ అంశంలో పార్లమెంట్ సభ్యురాలు చేయబోయే సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. కాజీపేట స్టేషన్ ఫ్లాట్ ఫామ్ ల విస్తరణ అంశాన్ని ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించగా తాము ఈ విషయంలో జాతీయ కార్యాచరణలో భాగంగా చేపట్టిన అమృత్ తరహా అభివృద్ధిని అమలుపరుస్తున్నామన్నారు.

# గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలియజేసిన చైర్మన్ రవిందర్ రావు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్11:** గ్రేటర్ హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని, తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెనీ రవీందర్ రావు బుధవారం డిసిసిబి డైరెక్టర్ కెసిరెడ్డి ఉపేందర్ రెడ్డి ని, కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట నాయకులు తదితరులు ఉన్నారు.

# మోహన్ బాబు దాడిలో గాయపడ్డ జర్నలిస్టుకు సర్జరీ పూర్తి

**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్11:** టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు చేసిన దాడిలో గాయపడిన జర్నలిస్టుకు వైద్యులు సర్జరీ చేశారు. జర్నలిస్ట్ రంజిత్‌కు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్లు సర్జరీ పూర్తి చేశారు. రెండు, మూడుచోట్ల ఫ్రాక్చర్ అయిన జైగోమాటిక్ ఎముకకు వైద్యులు సర్జరీ చేశారు. మరో మూడు, నాలుగు రోజులు ఆ జర్నలిస్టును అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు తెలిపారు. జర్నలిస్టుకు మెదడు, తలలో అంతర్గతంగా ఏమైనా డ్యామేజీ జరిగిందా అని ఆయన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో ఏమైనా సమస్య తలెత్తుతుందా అని టెన్షన్ పడుతున్నారని సమాచారం. న్యూస్ కవరేజ్ కోసం జల్‌పల్లిలోని మంచు మోహన్ బాబు నివాసానికి మంగళవారం సాయంత్రం వెళ్లిన సమయంలో మీడియా ప్రతినిధి రంజిత్‌పై నటుడు ఒక్కసారిగా దాడి చేయడం కలకలం రేపింది. నమస్తే అంటూ జర్నలిస్ట్ వద్దకు వచ్చిన మోహన్ బాబు ఒక్కసారిగా రంజిత్ చేతిలో ఉన్న న్యూస్ కవర్ చేస్తున్న మైకును లాక్కున్నారు. అంతటితో ఆగకుండా తీవ్ర ఆవేశంతో జర్నలిస్టు తలపై కొట్టడంతో అంతర్గతంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం జర్నలిస్టును హాస్పిటల్ తరలించగా పరీక్షించిన డాక్టర్లు ఆయనకు జైగోమాటిక్ బోన్ ఫ్యాక్చర్ అయినట్టుగా నిర్ధారించారు. సర్జరీ సైతం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు డాక్టర్లు ఆ జర్నలిస్టుకు సర్జరీ చేసి బోన్ ఫ్రాక్చర్ సరిచేశారు. అయితే మూడు, నాలుగు రోజులు వైద్య పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుందని, కోలుకోవడానికి సమయం పడుతుందని డాక్టర్లు తెలిపారు. మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు చేసిన దాడిని జర్నలిస్టు సంఘాలతో పాటు పలు సొసైటీలు, నేతలు సైతం తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం నిరంతరం వార్తలు చేరువ చేసే వారిపై దాడులకు దిగడం హేయమైన చర్య అని విమర్శిస్తున్నారు. జర్నలిస్టులకు మోహన్ బాబు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. వయసులో అంత పెద్ద వ్యక్తి, సుదీర్ఘమైన అనుభవం ఉన్న మోహన్ బాబు ఆవేశానికి లోనై జర్నలిస్టులతో దురుసుగా ప్రవర్తించి, దాడులు చేయడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై డిసెంబర్ 24 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులకు సూచించింది. మోహన్ బాబు దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ పై బుధవారం విచారించిన హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. మోహన్ బాబు ప్రస్తుతం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిసిందే. నిన్న జల్‌పల్లిలోని ఆయన ఫాం హౌస్ వద్ద జరిగిన ఘటనలో ఆయనకు కంటి కింద స్వల్ప గాయం కాగా, మరోవైపు హై బీపీతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాలని, అబ్జర్వేషన్‌లో ఉంచామని వైద్యులు ప్రకటించారు. మంచు వివాదంలో మోహన్ బాబు, మంచు విష్ణు, మనోజ్‌లకు రాచకొండ పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీపీ కార్యాలయంలో హాజరైన మనోజ్ శాంతిభద్రతల సమస్య సృష్టించబోనని రూ.1 లక్ష రూపాయలకు బాండ్ ఇచ్చారు. పోలీసుల ఎదుట తాను హాజరు కావాల్సిన అవసరం లేదని మంచు విష్ణు పేర్కొన్నారు.

## బండి సైలెన్సర్ మారిస్తే

# క్రిమినల్ కేసులు

- టూ వీలర్స్‌కు వరంగల్ పోలీసుల హెచ్చరిక



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), డిసెంబర్11:** ద్విచక్ర వాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్ మారిస్తే.. చట్టరీత్యా నేరమే కాకుండా దాని నుంచి వచ్చే సౌండ్స్ తో పెద్ద ఎత్తున శబ్ధ కాలుష్యం, జనాలకు ఇబ్బంది కూడా కలుగుతోంది. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీసులు బైక్ సైలెన్సర్లు మార్చే బైకర్లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ ఏడాది ఇప్పటికే వరంగల్ కమిషనరేట్ వ్యాప్తంగా వెయ్యికిపైగా సైలెన్సర్లు స్వాధీనం చేసుకోగా.. ఇకనుంచి బండి సైలెన్సర్ మారిస్తే సంబంధిత ఓనర్ల పై క్రిమినల్ కేసులు బుక్ చేసేందుకు రెడీ అవుతున్నారు. కేసుల బారిన పడకుండా యువత సైలెన్సర్ శబ్ధాలకు దూరంగా వరంగల్ పోలీసులు సూచిస్తున్నారు. బండ్లను స్టేటస్ సింబల్ గా భావిస్తున్న కొందరు స్టూడెంట్స్, యూత్ స్పోర్ట్స్ బైక్ లు, బుల్లెట్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇక రోడ్లపై వెళ్లే సమయంలో తామే స్పెషల్ అట్రాక్షన్ గా కనిపించాలనే ఉద్దేశంతో బండ్లకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు మార్చేస్తున్నారు. పెద్ద శబ్ధం వచ్చే సైలెన్సర్లను బిగించుకుంటున్నారు. ఇందుకు సైలెన్సర్లను బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఆ తరువాత పెద్ద సౌండ్స్ తో మెయిన్ రోడ్లపై పరుగులు తీస్తున్నారు. వాస్తవానికి ఇలా సైలెన్సర్ మార్చడం మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 183 ప్రకారం నేరం. దీంతోనే వరంగల్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల సైలెన్సర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఈ మేరకు వరంగల్ నగరంలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తంగా 1,142 సైలెన్సర్లు సీజ్ చేశారు. అందులో అత్యధికంగా హనుమకొండ స్టేషన్ పరిధిలో 470, కాజీపేట స్టేషన్ పరిధిలో 352, వరంగల్ స్టేషన్ పరిధిలో 320 సైలెన్సర్లను సీజ్ చేశారు. అనంతరం రోడ్డు రోలర్ల సహాయంతో ధ్వంసం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 183 ప్రకారం సైలెన్సర్ మార్పు విషయాన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు.. ఇకనుంచి పెద్ద సౌండ్స్ చేసే సైలెన్సర్లు అమర్చిన బైకులపై కఠిన చర్యలు చేపట్టేందుకు రెడీ అవుతున్నారు. ఈ మేరకు బండి ఓనర్లపై క్రిమినల్ నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అంతేగాకుండా బండిని సీజ్ చేయడంతో పాటు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. పిల్లల బండ్లపై తల్లిదండ్రులు కూడా నిఘా పెట్టాలని, పిల్లలు సైలెన్సర్లు మార్చినా తల్లిదండ్రులు కూడా కౌన్సిలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

# ప్రజా [పాలన] సమస్యలపై సిపిఎం ఇంటింటి సర్వే...

**తొలి అక్షరం/బయ్యారం, డిసెంబర్ 11:** సిపిఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరక బయ్యారం 1వ,వార్డు నుండి ప్రజా (పాలన) సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని ఇంటి ఇంటి సర్వే చేపట్టడం జరిగిందని, ఈ సర్వేలో అర్హులైన వారికి ఇండ్ల నిర్మాణం, పెన్షన్ సౌకర్యం, డ్రైనేజీ , రోడ్ల నిర్మాణం, విద్యుత్తు దీపాలు లేకపోవడం, వార్డులో రకాల సమస్యలు ప్రజల నుండి అడిగి తెలుసుకోవడం జరిగిందని, భూమి కలిగి ఉన్నటువంటి రైతులకు నేటికీ పట్టా పాస్ బుక్ కాలేదని, సదరం ధ్రువీకరణ పత్రం పొందిన వారికి నేటి వరకు వికలాంగులకు చెందిన పెన్షన్ రావటం లేదని, వడలల్లో ఉన్న చెత్తాచెదారం వల్ల దోమలు విపరీతంగా పెరిగి విశ్వ జ్వరాలు వస్తున్నాయని స్థానిక ప్రజలు సర్వే బృందానికి తెలియజేశారు.కళ్యాణ లక్ష్మి వంటి ప్రభుత్వ స్కీము పథకాలలో సమస్యలను కూడా సర్వే బృందం గుర్తించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటిలను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సర్వే బృందం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మండా రాజన్న,మండల కార్యదర్శి నంబూరు మధు, సి ఐ టి యు మండల కన్వీనర్ వల్లాల వెంకన్న ,ఎస్కే యకుబ్, పురుషోత్తం, మోహన్, రాము తదితరులు ఉన్నారు .

